క్లుప్తంగా

కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు

లింగంపేట: మండల కేంద్రమైన లింగంపేటలో శనివారం కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వంద మందికి పైగా కార్మికులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌సీ మేనేజర్ అంగోత్ ప్రవీణ్‌నాయక్, మేస్త్రీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, అల్లూరి, బాలయ్య, చిరంజీవి, భాషా, పోచయ్య, రమేశ్, అమృత, కిషన్ పాల్గొన్నారు.

కంటి వెలుగుతో పేదలకు ప్రయోజనం

పెద్దకొడప్‌గల్: కంటి సమస్యల పరిష్కారానికి కంటి వెలుగు కార్యక్రమం ఎంతో ప్రయోజనం అని సూపవైజర్ నాగమణి తెలిపారు. శనివారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో 186 మందికి పరీక్షించి 35 మందికి అద్దాలు పంపిణీ చేశారు. 12 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు.

ఫ్యాక్టరీతో ముప్పు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ ద్వారా వెలువడే వాయువు ప్రజల ప్రాణాలకు ముప్పు కలుగుతోందని కాచాపూర్ గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన దీక్షలు 47వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శనివారం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు మద్దతు ప్రకటించారు.

కాంగ్రెస్‌లో చేరిక



మద్నూర్: జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం ఆధ్వర్యంలో మండలంలోని పెద్ద ఎక్లార గ్రామానికి చెందిన 20 మంది బీఆర్ఎస్‌కి చెందిన నాయకులు, కార్యకర్తలు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా గంగారాం మాట్లాడుతూ అబద్ధపు కేసీఆర్ అవినీతి పాలన అంతమయ్యే సమయం దగ్గర పడిందని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం మరిచిపోయి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ఇందతా ప్రజలు గమనిస్తూనే ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



బాన్సువాడ: ఎస్సీ వర్గీకరణ, మహాజన రాజ్యాధికార సాధన లక్ష్యంగా 21న బాన్సువాడలో నిర్వహించనున్న సభకు మహాజన నేత మంద కృష్ణమాదిగ హాజరు అవుతారని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు వెల్లడించారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బాన్సువాడ సెగ్మెంట్ ఇన్‌చార్జి డల్లా సరేష్, దుర్కి బాలరాజు, శ్రీకాంత్ మాదిగ, కల్లూరు గంగారాం, సంగం సాయిలు, హన్మాండ్లు, సాయిలు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలు



సదాశివనగర్: మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డిలో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మట్టి నమూనా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు అధిక దిగుబడులు సాధించడానికి తప్పనిసరిగా తమ పంట పొలాల్లో మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. స్థానిక సొసైటీ ఆధ్వర్యంలో భారతీయ వరి పరిశోధన సంస్థ, సేవా స్ఫూర్తి ఫౌండేషన్, ఇఫ్కో, రుద్రూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు మట్టి పరీక్షలు చేస్తున్నట్లు వెల్లడించారు.

హజ్ యాత్ర విజయవంతం కావాలి



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారి బస్సును ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ శనివారం రాత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ యాత్ర వియవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

అనుమతులు రాక ఇబ్బందులు

- దశాబ్దాలు గడిచినా నెరవేరని కల
- అటవీశాఖ అధికారుల అభ్యంతరంతో నిలిచిన రోడ్డు పనులు
- రోడ్డు పూర్తయితే పలు గ్రామాలకు లబ్ధి



పోతాయిపల్లి నుంచి నందివాడ వెళ్లే రోడ్డు



శ్రమదానం చేసి స్థానికులు వేసుకున్న రోడ్డు

లింగంపేట: అభివృద్ధి పనులను అధికారులే అడ్డుకుంటున్నారు. అటవీ భూములు వేల ఎకరాలు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోని అధికారులు ప్రజలకు ఉపయోగపడే రోడ్డు పనులకు మాత్రం అడ్డంకులు సృష్టిస్తున్నారు. మండలంలోని పోతాయిపల్లి, నందివాడ రోడ్డుకు నిధులు మంజూరైనా పనులకు నోచుకోవడం లేదు. పాలకులు, అధికారులు మారుతున్నారే తప్ప ఏళ్లు గడుస్తున్నా రోడ్డుకు మోక్షం రావడం లేదు. రోడ్డు నిర్మాణానికి అనుమతులు తేవడంలో పాలకులు, అధికారులు విఫలం అవుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోతాయిపల్లి నుంచి నందివాడ మీదుగా కామారెడ్డికి వెళ్లే రోడ్డు పనులు పూర్తయితే పలు గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

2009 నుంచి అంతే..

2009లో 15 కిమీ పొడవున రోడ్డు వేసేందుకు రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. అప్పట్లో బీటీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. అయిలాపూర్ నుంచి పోతాయిపల్లి వరకు బీటి రోడ్డు వేశారు. పోతాయిపల్లి నుంచి నందివాడకు అటవీ ప్రాంతం నుంచి రోడ్డు వేయాలి. గతంలో పోతాయిపల్లి, కోమట్‌పల్లి, అన్నారెడ్డిపల్లి, కేశాయిపేట, సురాయిపల్లి తదితర గ్రామా ల ప్రజలు స్వచ్ఛందంగా వందల మంది రోడ్డు పనుల కోసం శ్రమదానం చేసి బండ్లబాటను రోడ్డుగా మార్చారు. అయితే అటవీశాఖ అధికారులు తమ పరిధిలోని అటవీ భూమి గుండా రోడ్డు వేయడానికి వీలులేద ని పనులు నిలిపివేశారు. దీంతో నాలుగు కిలోమీట ర్ల పొడవున బీటీ రోడ్డు పనులు నిలిచిపోయాయి.

11 కిమీ దూరం తగ్గుతుంది..

పోతాయిపల్లి-నందివాడ రోడ్డు నిర్మాణంతో పాల్కంపేట, కన్నాపూర్, ర్యాల్లి, అయిలాపూర్, పోతాయిపల్లి, కోమట్‌పల్లి, అన్నారెడ్డిపల్లి, కేశాయిపేట, సురాయిపల్లితో పాటు పలు తండాల ప్రజలు కామారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్లడానికి సౌకర్యంగా ఉంటుంది. ఆయా గ్రామాల ప్రజలు ప్రస్తుతం లింగంపేట మీదుగా వెళ్లాలంటే 38 కిలోమీటర్లు దూరం ఉంటుంది. పోతాయిపల్లి-నందివాడ, ఎర్రాపహడ్ మీదుగా 25 కిలోమీటర్లు దూరం ఉంది. పనులు పూర్తయితే 11 కిమీ దూరం తగ్గుతుంది. రోడ్డు నిర్మాణం కోసం దశాబ్దాలుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, రెవిన్యూ, అటవీ శాఖ జిల్లా, రాష్ట్ర అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోతోంది.

ఇబ్బందులు తగ్గుతాయి



రోడ్డు నిర్మాణం పూర్తయితే ఇబ్బందులు తగ్గుతాయి. చదువుకునేందుకు విద్యార్థులు కామారెడ్డికి లింగంపేట మీదుగా వెళ్లాల్సి వస్తుంది. పోతాయిపల్లి-నందివాడ రోడ్డు పూర్తయితే నేరుగా జిల్లా కేంద్రానికి వెళ్లవచ్చు.

– చీటూరి సంగాగౌడ్, పోతాయిపల్లి

దూరం తగ్గుతుంది



రోడ్డు పనులు పూర్తయితే దూరం తగ్గడంతో పాటు రవాణా ఖర్చులు తగ్గుతాయి. ప్రజలకు ఉపయోగపడే పనులను అటవీ శాఖ అధికారుల అడ్డుకోవడం సరికాదు.

– ఆమేటి సతీష్, పోతాయిపల్లి

బీసీ కులాలన్నింటికీ సాయం అందించాలి



ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

కామారెడ్డి అర్బన్: కులవృత్తుదారులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష సహాయం అన్ని బీసీ కులాలకు వర్తింపజేయాలని సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను కోరారు. మేదరి, రజక, నాయీబ్రహ్మణ, వడ్ల, అవుసుల, దూదేకుల, నూరుభాషా కులాల వారికి కూడా న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గంప గోవర్ధన్‌ను కలసి సన్మానం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఎం.మోహనచారి, అబ్దుల్ అజీజ్, కిషన్, పి.ధర్మపురి, ప్రవీణ్, మాయ ప్రసాద్, ప్రవీణ్ కుమార్, ఎం.రాములు, యు.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే హన్మంత్ సింధే



డోంగ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధే

మద్నూర్: దేశంలో ఎక్కడ లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలపై ఉన్న ప్రేమతోనే అర్హులైన ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరుతున్నాయని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పేర్కొన్నారు. డోంగ్లీ మండల కేంద్రంలో శనివారం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు డోంగ్లీని ప్రత్యేక మండలంగా మార్చాలని కోరిన వెంటనే సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారని పేర్కొన్నారు. కులవృత్తుల వారికి ప్రభుత్వం ఇచ్చే సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాలనా సౌలభ్యం కోసం అవాస గ్రామాలు, తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సాయాగౌడ్, సర్పంచ్ మాధవిపటేల్, జెడ్పీటీసీ అనిత, రాంపటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శశాంక్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



గున్కుల్‌లో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



లింగాపూర్‌లో వాటర్ ట్యాంకు నిర్మాణానికి..

నిజాంసాగర్: మండలంలోని గున్కుల్ గ్రామంలో రూ. 20 లక్షలతో చేపడుతున్న పంచాయతీ భవన నిర్మాణానికి శనివారం బీఆర్ఎస్ నాయకులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాలీస్. రాజుపటేల్, కాశీరెడ్డి, సాయిరెడ్డి, రాజిరెడ్డి, బొర్ర సురేశ్, నరేశ్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బాగారెడ్డి, దుర్గయ్య, శ్రీనివాస్‌గౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి..

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి శనివారం బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొమిరెడ్డి పెద్ద నారాయణ, యాదవరెడ్డి, కాసర్ల శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరువులో పూడికతీత పనులు చేపట్టాలి

సదాశివనగర్: మండల కేంద్రంలోని కొత్త చెరువు నుంచి పాత చెరువు కాలువ పూడికతీత పనులను వెంటనే చేపట్టాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక పాత చెరువు కాలువను పరిశీలించారు. ఎస్సీ కాలనీకి సమీపంలో ఉన్న కాలువకు మరమ్మతులు చేయించకుండా కొత్త చెరువు వద్దనే పండుగ నిర్వహించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఆయన వెంట జగ్గ బాల్‌రాజు, రాజన్న, ఆస రాజు, శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ నర్సింలు

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని బిక్కనూర్ గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ నర్సింలు శనివారం ప్రారంభించారు. జొన్నలను పండించిన రైతులు ఇబ్బందులు పడకుండా సొసైటీల ద్వారా కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వెల్లడించారు. క్వింటాల్ జొన్నలను ప్రభుత్వం రూ. 2,970 మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి విశ్వనాథ్, డైరెక్టర్ సుఖేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ రథం వితరణ



సదాశివనగర్: మండలంలోని భూంపల్లికి అదే గ్రామానికి చెందిన నేతాజీ యువజన సంఘం సభ్యులు శనివారం వైకుంఠ రథాన్ని వితరణ చేశారు. గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని వారు పేర్కొన్నారు.

కార్యవర్గం..

- జంగము సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి టౌన్: జంగము సంఘం జిల్లా కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు విశ్వేశ్వరయ్య అధ్యక్షతన శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జంగం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా నాగభూషణం, కోశాధికారిగా శశిధర్, ఉపాధ్యక్షులుగా నర్వ ప్రభాకర్, మహిళా కార్యదర్శిగా లతలతో పాటు పలువురి కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ప్రభుదేవ్ , భైరయ్య, భద్రప్ప, నాగభూషణం బసంత్ రాజ్, రేవంత్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మండలంలో..

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండల కేంద్రానికి చెందిన సుభాషప్ప జంగమ సమాజం జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

ఆడపిల్ల పుడితే బాధపడే రోజులు పోయాయి



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం: ఆడపిల్ల పుడితే బాధపడే రోజులు పోయాయని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం 91 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, పరికి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: మండల కేంద్రానికి చెందిన గుండప్పకు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దారాస్‌వార్ సురేష్ సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్సీపటేల్, నాయకులు కంచిన్ హన్మండ్లు, కాశీనాథ్‌పటేల్, రచ్చ కుషాల్, బలరాం తదితరులు పాల్గొ న్నారు.

నిజాంసాగర్: మండలంలోని మల్లూర్ గ్రామంలో పలువురి లబ్ధిదారులకు సర్పంచ్ కాశీంసాబ్ కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మనోహర్, ఉప సర్పంచ్ దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న యాదవ ఎంప్లాయీస్ సొసైటీ నాయకులు



మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో..

కామారెడ్డి రూరల్: జిల్లా యాదవ ఎంప్లాయీస్ సొసైటీ (వైఈఎస్) ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన యాదవ కులానికి చెందిన విద్యార్థులకు శనివారం శిశుమందిర్ పాఠశాలలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు అర్కల ప్రభాకర్‌యాదవ్, డాక్టర్ రవితేజ మాట్లాడుతూ విద్య, వ్యాపారం, ఆర్థికంగా, రాజకీయంగా యాదవులు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సాయన్న యాదవ్, శ్రీనివాస్ యాదవ్, లద్దూరి లక్ష్మీపతియాదవ్, భూమేష్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి అర్బన్: పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో శనివారం జ్ఞాపికతో పాటు ప్రసంశాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్యాపటేల్ మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్, పాలిటెక్నిక్ స్థాయిలో చదువు మానేయకుండా ఉపాధి నిచ్చే కోర్సులు చేయాలని సూచించారు.

ప్రభుత్వం మున్నూరు కాపు కార్పోరేషన్ ఏర్పాటు చేసి రూ. 5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మామిండ్ల అంజయ్య, ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నీలం నర్సింలు, మహిళా ప్రతినిధులు బజా లలిత, జి.పద్మ, సమన్వయకర్త కాసర్ల రవీందర్, కార్యదర్శి మామిండ్ల లింగం, నీలం లింగం, ముదాం రాజేందర్, కొత్త అరవింద్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 436 కేసుల పరిష్కారం



బాన్సువాడలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్



ఎల్లారెడ్డిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తి హారిక

బాన్సువాడ: బాన్సువాడ జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 436 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మొగులయ్య, హమీద్, ఆజీమ్, అర్షద్, డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, బాన్సువాడ రూరల్, టౌన్ సీఐలు మురళి, మహేందర్‌రెడ్డి, పిట్లం, నిజాంసాగర్, నస్రుల్లాబాద్, బీర్కూర్ ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో న్యాయమూర్తి హారిక ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమంలో పీపీ వీరన్న, న్యాయవాదులు శ్రీకాంత్, పండరి, సతీష్, శ్రీనివాస్, సాయిబాబా, పలు బ్యాంకు మేనేజర్లు, పోలీసులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



గున్కుల్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

బీబీపేట: దివ్యాంగులకు రూ. 4116 పింఛన్ పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో మండలంలోని మాందాపూర్ దివ్యాంగ సంఘం సభ్యులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మల్లయ్య, పెంటయ్య, రాజిరెడ్డి, సంజీవరెడ్డి, అంజయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: పింఛన్ పెంచడాన్ని హర్షిస్తూ దివ్యాంగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పర్వయ్య, ఆర్టీఐ రాష్ట్ర జోనల్ ప్రధాన కార్యదర్శి లెగ్గల రాజు, లక్ష్మయ్య, గంట బాబు, ఆశయ్య, అశోక్, శ్రీనివాస్, సంతు, సాయిలు, పోచయ్య, రాములు, పెంటయ్య, లక్ష్మయ్య, సాయిరాజు, ఇందిర పాల్గొన్నారు.

నిజాంసాగర్: మండలంలోని గున్కుల్ గ్రామంలో దివ్యాంగులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రాజు, కాశిరెడ్డి, సాయిరెడ్డి, సురేశ్, నరేశ్, బాగారెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



నాగిరెడ్డిపేట: మండలంలోని మేజర్‌వాడి గ్రామంలో శనివారం పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను వైభవంగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. పోచమ్మ అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు.

ఊరదమ్మ విగ్రహం..

నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం గ్రామంలో ఊరడమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అంతకుముందు అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలోని ప్రధాన వీధులగుండా ఊరేగించారు. గ్రామానికి చెందిన పుండరీకం అనే వ్యక్తి సొంత డబ్బుతో ఆలయాన్ని నిర్మించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజిత, మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

తాడ్వాయి: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

పోటెత్తిన భక్తులు

మద్నూర్: మండలంలోని సలాబత్‌పూర్‌లో ఉన్న హనుమాన్ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు అరవింద్, శైలేంద్ర మహారాజ్‌లు ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం పల్లకీ కార్యక్రమం చేపట్టారు.

సంక్షిప్తం

కట్ట మైసమ్మ ఆలయ నిర్మాణానికి విరాళాలు

రాజంపేట: రాజంపేట ఊర పండుగ ఉత్సవాల్లో భాగంగా కట్ట మైసమ్మ ఆలయ నిర్మాణానికి రాజంపేటకు చెందిన జంగం శివకుమార్ రూ. లక్ష, విగ్రహం కోసం ఆముదాల రాజు రూ. 31 వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

అడ్మిషన్ తీసుకోవాలి

బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాది మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షలో సీటు సాధించిన విద్యార్థులు వెంటనే అడ్మిషన్ తీసుకోవాలని ప్రిన్సిపాల్ ఫకీరయ్య కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్: కులవృత్తిదారులకు పనిముట్ల కోసం ప్రభుత్వం అందించే సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఇంచార్జి ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి తెలిపారు. 18 నుంచి 55 ఏళ్ళలోపు వయస్సున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 20లోగా మీ సేవాలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

మున్సిపల్ సిబ్బంది ర్యాలీ

ఎల్లారెడ్డి: చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్తను తరలించే వాహనాల్లోనే వేయాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మున్సిపల్ సిబ్బంది శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

ముదిరాజ్ సంఘ భవనానికి నిధులు

భిక్కనూరు: అంతంపల్లి గ్రామంలో ముదిరాజు సంఘ భవన నిర్మాణానికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ రూ. 4 లక్షలు మంజూరు చేయించారు. సర్పంచ్ మధుమోహన్‌రెడ్డి, విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ అలకొండ గంగారెడ్డి, ముదిరాజు సంఘం అధ్యక్షుడు పిట్ల రాజయ్య గంప గోవర్ధన్‌ను సన్మానించారు.

డిగ్రీలో అడ్మిషన్లు ప్రారంభం

బిచ్కుంద: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రముఖర్జి తెలిపారు.

నేడు కురుమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కామారెడ్డి రూరల్: టెన్త్, ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన కురుమ కులానికి చెందిన విద్యార్థులకు జిల్లా కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో ఆదివారం సదాశివగనర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలో ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని కేవైసీఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు మామిడి సంజీవ్ కురుమ, జిల్లా లీగల్ అడ్వైజర్ చెట్కూరి గంగారాజ్యంలు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9010721308 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆలయంలో ముగిసిన పూజలు

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో నిర్వహిస్తున్న వాసవీ కన్యకాపరమేశ్వరీ మాత ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు మ్యాడం చంద్రయ్య, ఉపాధ్యక్షులు దుద్దెల్లి శివలింగం తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలంతా బడిలో ఉండాలి

బాన్సువాడ రూరల్: ఆరు నుంచి 14 ఏళ్ళలోపు పిల్లలను బడిలో చేర్పించాలని దేశాయిపేట్ కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎర్వాల రామక్రిష్టారెడ్డి తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఆయన గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.